క్లుప్తంగా

నేడు వేంపల్లి షరీఫ్ కథలుపై చర్చ

తెనాలి: ఊరి పేరునే ఇంటిపేరుగా చేసుకున్న రచయిత వేంపల్లి షరీఫ్ కథాసంపుటాలు జుమ్మా, టోపి జబ్బార్ పుస్తకాలపై శనివారం తెనాలిలో చర్చా వేదిక జరగనుంది. ముస్లింల అస్తిత్వ వేదనను ఆవిష్కరిస్తూనే మానవతా స్ఫూర్తిని రగిలించే, ఆయా సంపుటాల్లోని కథలకు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారంతో సహా పలు గౌరవాలు లభించాయి. ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో స్థానిక సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు నెలనెలా నిర్వహిస్తున్న మంచి పుస్తకంపై చర్చావేదికలో భాగంగా సాయంత్రం ఆరు గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయే సభకు జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. సాహిత్య విమర్శకుడు సుంకర గోపాల్, సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి సత్యరంజన్, రచయిత లలితానంద్ చర్చలో పాల్గొంటారు. కథారచయిత వేంపల్లి షరీఫ్ తన స్పందనను తెలియజేస్తారు.

రేపు సురభి సంస్థచే 'మాయాబజార్' ప్రదర్శన



తెనాలి: ప్రముఖ పౌరాణిక నాటక సంస్థ సురభి సమాజంచే ఈనెల 21వ తేదీ సాయంత్రం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో 'మాయాబజార్' నాటకాన్ని ప్రదర్శించనున్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్స్ థియేటర్ సంయుక్త నిర్వహణలో జరిగే ఈ ప్రదర్శన వివరాలను శ్రీసాయి సంతోషి నాట్యమండలి ఆర్గనైజర్ సురభి సంతోష్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రదర్శనకు ముందు కూచిపూడి, జానపద నృత్యప్రదర్శనలు ఉంటాయని నిర్వాహక సంస్థల బాధ్యులు తెలిపారు. భారీ సెట్టింగులు, సాంకేతిక నైపుణ్యంతో అనుభవజ్ఞులైన కళాకారులచే ప్రదర్శించే మాయాబజార్‌ను కళాభిమానులు తిలకించాలని కోరారు. ఆయా సంస్థల నాయకులు గరికపాటి సుబ్బారావు, ఆరాధ్యుల కన్నా, అయినాల మల్లేశ్వరరావు, లక్కరాజు లక్ష్మణరావు, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు): ప్రైవేట్ బస్సు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో బాపట్ల జిల్లా వాసి దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బాపట్ల జిల్లా పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన వెల్లటూరి వేణుబాబు (38) తల్లి అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని రమేష్ ఆస్పత్రిలో ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతోంది. తల్లిని చూసేందుకు శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై గుంటూరుకు బయల్దేరాడు. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం కోల్డ్ స్టోరేజీ సమీపంలో గుంటూరు వైపు నుంచి ప్రత్తిపాడు వైపు వస్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వేణుబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనాస్థలానికి చేరుకున్న ప్రత్తిపాడు పోలీసులు మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేసేవరకు పోరాటం

తెనాలి: ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో ప్రజలకు తీవ్ర నష్టమని, ఆ చట్టాన్ని రద్దుచేసేవరకు పోరాటం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య చెప్పారు. రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు అధ్యక్షత వహించారు. ఓవైపు భూముల రీసర్వే అని చెబుతూ అది పూర్తికాకముందే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తేవటం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రంలోని నీతిఆయోగ్ అవినీతి అయోగ్‌గా మారిందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాల్ మాట్లాడుతూ కొత్త చట్టంతో భూ సంబంధిత వివాదాలను ట్రిబ్యునల్ ద్వారా రెండేళ్ల కాలపరిమితిలో పరిష్కరిస్తామని చెబుతున్నారని, అదెలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, తెలుగు రైతు నాయకులు ఈదర పూర్ణచంద్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు, ఎన్వీ మహేశ్వరరావు, కేవీ సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, కె.పూర్ణచంద్రరావు, ఆళ్ల సాంబిరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, ఎన్.రాజ్యలక్ష్మి, ఎం.సాంబశివరావు, డి.సాంబశివరావు, బి.అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

బాపట్లటౌన్: అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని వెదుళ్లపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న కోట చెన్నకేశవ రెడ్డిను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 10 మద్యం సీసాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో సామాజిక న్యాయ పరిపాలన

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, సామాజిక న్యాయ పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. సామాజిక చైతన్యమూర్తి అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ సువర్ణాక్షరాలతో లిఖించదగిన అంశంగా చెప్పారు. విజయవాడ స్వరాజ్ మైదాన్‌లో ఏర్పాటుచేసిన సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహం, స్మృతివనాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేస్తున్న కార్యక్రమానికి తెనాలి నుంచి భారీసంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని తెనాలి పట్టణం, తెనాలి రూరల్, కొల్లిపర మండలాల్నుండి నుండి 80 పైగా బస్సులు, ఇతర ప్రైవేటు/ సొంత వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. తెనాలి–విజయవాడ రహదారిలో నందివెలుగు వద్ద కొన్ని బస్సులకు ఎమ్మెల్యే శివకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలం, ఆలోచనలతో పరిపాలన సాగిస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని గుర్తుచేశారు. అంబేడ్కర్ వంటి చైతన్యమూర్తి స్ఫూర్తిని చాటేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయటం గొప్ప విషయమన్నారు. సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా స్మృతివనం, అంబేడ్కర్ విగ్రహ ప్రదేశం వెలుగొందుతుందని, గొప్ప పర్యాటక ప్రదేశంగానూ పర్యాటకులను ఆకర్షిస్తుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ పెత్తందారీ భావాలపై తిరుగుబాటుకు స్ఫూర్తినిచ్చేలా సామాజికన్యాయ మహాశిల్పం, విజయవాడకు మణిహారంగా వెలుగొందగలదని చెప్పారు. గుంటూరు కృష్ణ, తట్టుకూళ్ల అశోక్‌యాదవ్ తదితర పార్టీ నేతలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి...

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణకు తరలివెళుతున్న సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక నాయకులు సంతోషం వ్యక్తంచేశారు. విజయవాడకు వెళుతుండగా మార్గమధ్యంలో ఊరి పొలిమేరల్లో అంబేడ్కర్ ఫైబర్ విగ్రహాన్ని ఉంచి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహావిష్కరణతోపాటు సామాజిక సమతా సంకల్ప సభ పోస్టరును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హాజరై, అంబేడ్కర్ స్ఫూర్తితో ఆయన ఆశయాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళుతున్నారని చెప్పారు. అక్కిదాసు కిరణ్‌కుమార్, కోలా వాసు, కాళిదాసు విజయసత్యం, కొడాలి క్రాంతితోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

చేనేత రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు బాలాజీ

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.బాలాజీ కోరారు. శుక్రవారం భట్టిప్రోలు రైలుపేట సొసైటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలాజీ మాట్లాడారు.

శని, ఆదివారాల్లో మంగళగిరిలోని మార్కండేయ పద్మశాలీయ కల్యాణ మండపంలో మహా సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహా సభలలో చేనేత పరిశ్రమ, చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలను రూపొందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో చేనేత ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు కె.రామకోటేశ్వరరావు, ఎస్.జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్‌లో ఒడిదొడుకులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సాంబశివరావు

గుంటూరు ఎడ్యుకేషన్: స్టాక్ మార్కెట్‌లో ఒడిదొడుకులపై పెట్టుబడిదారులకు అవగాహన అవసరమని ఎంసీఎక్స్ మెటల్ అండ్ ఎనర్జీ సంస్థ ప్రతినిధి ఎం. సాంబశివరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మహిళా సాధికారత విభాగ ఆధ్వర్యంలో మూలధన మార్కెట్లలో మదుపు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడి పెట్టే ముందుగా ఆయా సంస్థల పురోగతి, వ్యాపార, వాణిజ్య స్థాయి, మార్కెట్లో షేర్ క్యాపిటల్, టర్నోవర్, ఉద్యోగుల సంఖ్య తదితర విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. అగ్రశ్రేణి కార్పొరేట్ సంస్థల పనితీరును పరిశీలించాలని తెలిపారు. స్టాక్‌కు, కమోడిటీకి వ్యత్యాసాలతో పాటు కమోడిటీలో వర్తకం చేస్తున్నప్పుడు కలిగే ప్రయోజనాలు, వాటిలో రిస్క్, నష్టాలను వివరించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, మహిళా సాధికార విభాగ డైరెక్టర్ చల్లా వైష్ణవి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, అధ్యాపకులు డి. కళ్యాణి, డాక్టర్ గోప శ్రీనివాసరావు, ఏ. బాజీబాబు, సీహెచ్. వేదవతి, ఎస్. మణికంఠ, వి. అభిలాష్, బి.అనిత, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నారాకోడూరులో బజరంగ్ నేత్రజ్యోతి కళ్లజోళ్ల పంపిణీ

బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



చేబ్రోలు: దృష్టిలోపం కేవలం ఒక సమస్య మాత్రమే కాదని, మనిషికీ ప్రపంచానికీ మధ్య అడ్డుగోడ వంటిదని, దీన్ని పటాపంచలు చేయడానికే బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి పేరిట నిరివ్రామ కృషి చేస్తోందని వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ లోకాన్ని చూడగలిగే అవకాశం దేవుడు అందరికీ ఇచ్చినా అనేక సమస్యలు, లోపాలతో చాలా మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక స్తోమత లేనివారితో పాటు వెనుకబడిన వర్గాల ప్రజలు నేత్ర సమస్యలతో జీవితాన్ని ఈడుస్తున్నారని తెలిపారు. మరికొందరు వైద్యంపై సరైన అవగాహన లేక, చికిత్స విధానాల గురించి తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్ని అధ్యయం చేసిన బజరంగ్ నేత్ర జ్యోతి వారి సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. చేబ్రోలు మండలంలోని నారాకోడూరులో ఈనెల 11న బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమంలో భాగంగా నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరం ద్వారా కళ్లజోళ్లు అవసరమైన 652 మందికి వారి లోపం ఆధారంగా పంపిణీకి వాటిని సిద్ధం చేశామని తెలిపారు. నారాకోడూరులో శనివారం సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకూ కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని చెప్పారు. గ్రామస్తులంతా అందుబాటులో ఉండి, కళ్లజోళ్లు పొందాలని అంబటి మురళీకృష్ణ కోరారు.

ఔషధాలపై అవగాహన అవసరం

ఎల్‌బీకే సంస్థ అధ్యక్షులు డాక్టర్ గద్దె భానుప్రసాద్



ప్రసంగిస్తున్న భానుప్రసాద్

ఏఎన్‌యూ: ఔషధాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా ఎల్‌బీకే(లాంగ్ బీచ్ కెమిస్ట్) సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గద్దె భానుప్రసాద్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల, సైన్స్ కళాశాల జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగాలు సంయుక్తంగా 'మోడ్రన్ డిసీజెస్ ఆర్ ద డ్రగ్స్ ఓన్లీ ఛాయిస్ యాన్ ఇన్‌ట్రడక్షన్ కాంప్లిమెంటరీ స్ట్రాటజీస్' అనే అంశంపై శుక్రవారం ప్రత్యేక సదస్సును నిర్వహించారు. ముఖ్య వక్తగా డాక్టర్ భాను ప్రసాద్ ప్రసంగిస్తూ ఇటీవల ప్రపంచాన్ని వణికించిన కరోనా వంటి మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరు వాడుతున్న ఔషధాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కరోనా తర్వాత బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, తగు సలహాలను ఇచ్చారు. డయాబెటిక్, గుండె సంబంధిత అనారోగ్య సమస్యలు ఉన్నవారు కాంప్లిమెంటరీ మెడిటేషన్ ద్వారా లబ్ధి పొందే విధానాన్ని వివరించారు. మరొక వక్తగా పాల్గొన్న అమెరికాకు చెందిన గద్దె ప్రసూతి మాట్లాడుతూ ముఖ్యంగా పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువ శాతం అనారోగ్యానికి గురవుతున్నారని వారు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ క్రమంలో ఔషధాలపై కనీస అవగాహన పెంచుకోవాలని చెప్పారు. సదస్సుకు ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత అధ్యక్షత వహించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రమీలారాణి, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గంగాధరరావు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎల్. ఉదయ్ కుమార్, అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు విజ్ఞాన్స్ ఎన్‌సీసీ విద్యార్థిని ఎంపిక



నాగ సంహిత

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోఇన్ఫర్మాటిక్స్ విభాగంలోని రెండో సంవత్సరానికి చెందిన నాగ సంహిత చౌదరి ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎన్‌సీసీ విభాగంలో ఎంపికయ్యిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. రిపబ్లిక్ డే ప్రోగ్రాంలోని కర్తవ్య పాత్ విభాగంలో నాగ సంహిత పాల్గొంటుందని వెల్లడించారు. యూనివర్సిటీకి చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు గడిచిన కొన్ని సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికవడం గర్వకారణమని పేర్కొన్నారు. రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన విద్యార్థిని నాగసంహిత చౌదరిను విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.ఎస్. రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్‌సీసీ సిబ్బంది, విద్యార్థులు అభినందించారు

నెహ్రూ యువ కేంద్రం జిల్లా కమిటీ సభ్యుడిగా జగన్నాథశాస్త్రి



చెరుకుపల్లి: నెహ్రూ యువ కేంద్రం బాపట్ల జిల్లా కమిటీ సభ్యుడిగా చెరుకుపల్లికి చెందిన రాంపల్లి జగన్నాథశాస్త్రి శుక్రవారం నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బాధ్యతలను సమర్థంగా నిర్వహించి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరువారితోటకు చెందిన తెల్ల కిషోర్‌బాబు (35) పెయింటింగ్ పనులు చేసుకుంటూ పొన్నూరులో నివాసం ఉంటున్నాడు. కొద్దిరోజుల క్రితం గుంటూరువారితోటలోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చి, పూటుగా మద్యం తాగాడు. అది సరిపోకపోవడంతో శానిటైజర్‌లో ఆలౌట్ కలుపుకుని తాగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఈనెల 18న గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స కోసం చేర్పించారు. చికిత్స పొందుతున్న కిషోర్‌బాబు మృతి చెందాడు.

బాలికపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: బాలికపై సమీప బంధువు లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొండా వెంకటప్పయ్య కాలనీలో నివాసం ఉండే ఓ కుటుంబానికి చెందిన 14 సంవత్సరాల బాలికను సమీప బంధువు బహుమతులు ఇచ్చి మచ్చిక చేసుకున్నాడు. బాలికపై పలు మార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ కుమార్తెను వివాహం చేసుకోవాలని నిందితుడు శివను కోరారు. దీనికి అందుకు నిరాకరించాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యాన్ ఢీకొని..

గుంటూరు రూరల్: ద్విచక్ర వాహనాన్ని వ్యాన్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్లకు చెందిన మద్దెల రాజేష్ ద్విచక్ర వాహనంపై గుంటూరుకు వస్తున్నాడు. అదే సమయంలో ఎన్‌హెచ్ 16పై గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపుకు వెళుతున్న వాహనం మితిమీరిన వేగంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, అవతలవైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. రాజేష్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

తాడేపల్లి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను తాడేపల్లి పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాలు.. చిర్రావూరు ఇసుక రిచ్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు చిర్రావూరు గంగానమ్మ గుడి సమీపంలో తనిఖీ చేసినట్లు చెప్పారు. ఎటువంటి బిల్లులు లేకుండా కాటూరి శేఖర్ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండడంతో అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఈదులపాలెం (ప్రత్తిపాడు): మెట్లు ఎక్కుతూ జారి పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం గ్రామానికి చెందిన పొన్నాల విజయమ్మ (38) ఈ నెల 13న స్థానికంగా ఉన్న విగ్రహం వద్ద మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తూ జారి కిందపడింది. తలకు తీవ్ర గాయాలవ్వడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న కాటూరి ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం విజయమ్మ మృతి చెందారు. ఈ మేరకు మృతురాలి కుమారుడు పొన్నల ప్రకాష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి. రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కొడుకు, కుమార్తె ఉన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ప్రత్తిపాడు: పేకాట ఆడుతున్న ఏడుగురిని వట్టిచెరుకూరు పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. వట్టిచెరుకూరు మండలం యామర్రు శివారు పొలాల్లో రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న స్పెషల్ బ్రాంచి సమాచారం మేరకు శుక్రవారం వట్టిచెరుకూరు పోలీసులు జూద స్థావరంపై దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 20,350ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతరానికి వేమారెడ్డి లోకనీతులు ఆదర్శం

మహాకవి యోగి వేమన జయంతిలో వక్తలు

తెనాలి: మహాకవి యోగి వేమారెడ్డి జయంతిని శుక్రవారం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. యోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, తెనాలి ఆధ్వర్యంలో స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గల తల్లీ పిల్లల వైద్యశాలలో తల్లులకు పండ్లు పంపిణీ చేశారు. ముందుగా యోగి వేమారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ట్రస్ట్ అధ్యక్షుడు కిక్కూరి చిన్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ, పామరులకు సైతం అర్థమయేలా పద్యాలు చెప్పి, మెప్పించిన కవి వేమన అన్నారు. ఆటవెలదిలో అద్భుతమైన కవిత్వం, అనంతమైన విలువలు గల సలహాలు, సూచనలు, తెలుగు సంగతులు ఇమడ్చిన మహానుభావుడు వేమారెడ్డి అన్నారు. కార్యదర్శి సీహెచ్ విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ ఆటవెలది ఛందస్సులోనే చెప్పిన వేమన పద్యాలు లోక నీతులుగా చెప్పారు. సమాజంలో ఆయన స్పృజించని అంశం లేదనీ, అన్ని సమస్యలను భిన్న కోణాల్లోంచి దర్శించి, ఆ దర్శన వైశిష్ట్యాన్ని తన పద్యాలలో ప్రదర్శించారని గుర్తుచేశారు. ట్రస్ట్ సభ్యుడు బొంతు చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరిట దోపిడీలను వేమారెడ్డి ఎలుగెత్తటమే కాకుండా విగ్రహారాధనను నిరసించినట్టు చెప్పారు. లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో, చక్కటి ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా చెప్పారని అన్నారు. నేటి యువతరం వేమారెడ్డి చెప్పిన నీతులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొలుత ట్రస్ట్ నిర్వాహకులు వేమారెడ్డి జయంతిని ఏటా జనవరి 19న అధికారికంగా జరిపేందుకు జీవో విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రస్ట్ సభ్యుడు కిక్కూరి వెంకట సత్యనారాయణరెడ్డి రూ.30 వేలు, తిరుమలరెడ్డి లక్ష్మారెడ్డి రూ.2500 విరాళంగా అందజేశారు. కీసరి వెంకట కృష్ణారెడ్డి, ఢాకా సాంబిరెడ్డి, గాదె బాలకృష్ణారెడ్డి, జద్దు బాలకోటిరెడ్డి, కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, మారెళ్ల వెంకటరెడ్డి, మూలె పద్మావతి, తుమ్మా సీతారామిరెడ్డి, ప్రాతూరి వెంకటేశ్వరరెడ్డి, మాదిరెడ్డి తిరుమలరెడ్డి పాల్గొన్నారు.



యోగి వేమారెడ్డి చిత్రపటానికి నివాళి

బ్యాంకింగ్ సేవలపై అవగాహన అవసరం

రుణమంజూరుశాఖ ప్రారంభంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ఓం నారాయణశర్మ



రూ.50 లక్షల చెక్కును అందజేస్తున్న జీఎం ఓం నారాయణశర్మ

తెనాలి: బ్యాంకింగ్ రంగంలో పెరుగుతూ వస్తున్న వివిధ సేవల ప్రాముఖ్యత, వాటి ఆవశ్యకతను ఖాతాదారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ ఇండియా జనరల్ మేనేజర్ ఓం నారాయణశర్మ సూచించారు. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్థానిక కొత్తపేటలోని ప్రధాన శాఖ పైభాగంలో నూతనంగా ఏర్పాటుచేసిన రుణమంజూరు శాఖ (ఆర్ఏసీపీసీ)ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ రక్షణశాఖ ఉద్యోగులకు వేతన ఆధారిత ఉచిత బీమా కింద ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందిన ఆర్మీ ఉద్యోగి జి.కృష్ణకు సంబంధించి, బీమా డబ్బు రూ.50 లక్షల చెక్కును మృతుడి మాతృమూర్తి జి.అంజనాదేవికి ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి తోడ్పడుతున్న ఖాతాదారులకు ధన్యవాదాలు తెలియజేశారు. స్టేట్‌బ్యాంక్‌లో అందుతున్న సేవలను ఖాతాదారులు తెలుసుకుంటూ, ఆయా సేవలను అందుకోవాలని కోరారు. బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాటి, తెనాలి రీజినల్ మేనేజరు ఎస్ఎల్‌కేఎంవీ ప్రసాద్, చీఫ్ మేనేజరు వి.జయభారతి పాల్గొన్నారు.

నీటి నిల్వలతో అనేక అనర్థాలు



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: నీటి నిల్వల వలన అనేక అనర్థాలున్నాయని, దానిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని మలేరియా సబ్ యూనిట్ తెనాలి అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావులు పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని నాజరుపేట, చంద్రబాబు నాయుడు కాలనీలలో శుక్రవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నీటి నిల్వల వల్ల దోమల వ్యాప్తి పెరిగి అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు డ్రైడేగా శుక్రవారంను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరాణాధికారి అందే బాలచంద్రమౌళి, బంగారు నాగమల్లేశ్వరరావు, దాసరి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కాలర్ షిప్‌కు విద్యార్థుల ఎంపిక



వీరాస్వామి | భాను తేజ | రాజీవ్ | సురయు | నందుబాబు

అమృతలూరు(వేమూరు): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జాతీయ స్కాలర్ షిప్‌కు ఐదుగురు విద్యార్థులు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల నుంచి 20 మంది పరీక్షకు హాజరు అయినట్లు చెప్పారు. 8వ తరగతి విద్యార్థులు దేవరకొండ వీరాస్వామి, జి.భానుతేజ, జి.నందుబాబు, ఎ.రాజీవ్, ఎం.సురయు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిది తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఏడాదికి రూ.12, 000 అందజేయనున్నట్లు చెప్పారు. మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.